కథ

# బానిసల రాజ్జెం

-ఉదయమిత్ర



నాయినా! గీబునాది గట్టిది. నా బిడ్డలు మంచోల్లు. ఎవరికీ సెరుపుజేయనోల్లు, ఎవరికీ తలవొంచనోల్లు, నా ఒడిల ఉన్నప్పుడు ఏం సుఖం జూసింగ్రో గానీ, కాల్లొచ్చినంక ఆల్ల బతుకు కారడివే... కాయలు దెచ్చింగ్రు, కట్టెలు గొట్టింగ్రు .... బావులు దొవ్వింగ్రు ... బంజర్లు దున్నింగ్రు.

ఆల్లకాయలుగాసిన సేతులు జూస్తే ఆల్ల కష్టమేందో తెలుసొస్తది..

ఈ బునాది గట్టిది. నా బిడ్డలు మంచొల్లు నాయనా! దొరదగ్గర అడుగుడేందని, ఆయనకు మనం బాంచెలంగావొద్దని బయట్నుంచి అప్పుదెచ్చింగ్రు. గీబీడు భూముల పచ్చగజేసిగ్రు. పచ్చని సేలమద్దెన పచ్చగ బతికింగ్రు.

గిదిమా 'దొర' కు నచ్చలేదు...

నాబిడ్డలు నాయెం కోసం నిలబడ్డరు. నాయెం కోసం తెగవడ్డరు. మట్టి బిసికి మాణిక్యాలు బోసింగ్రుగాని, దొరకాల్లు బిసికి దాసులుగాలె ... రాత్రిపగలు పొలం దిక్కే జూసింగ్రు గాని, దొరజరిపే 'పంచాయతి'ల దిక్కు జూల్లె.

గదిమా 'దొర'కు కపంరమెత్తించింది ...

నా బిడ్డలు ఆడోల్లమీద పాటలు గట్టలేదు. ఆల్ల అందం మీద రాగాలు తీయలే.. ఆల్లుదొర లగడీల మీద పాటలు గట్టలే.. దొరతనాన్ని పొగడలే..

ఆల్లుకూలొల్ల పాటలు గట్టింగ్రు ... కూలోల కష్టాలు జెప్పింగ్రు. కష్టపడ్డానికో సుఖము దొరకాలన్నరు. తలెత్తుకు తిరుగు మన్నారు. కులానికి తక్కువైతేంది, 'ఇజ్జత్' కు నిలవడ్తమన్నారు.

గిది మా 'దొర' కు సిచ్చుబెట్టింది బిడ్డా!

దొరతనాన్ని మాటల్తోగాదు, శాతల్తోగాదు, మనసుల బెట్టుక మాట్లాడక పోయినా, దాన్ని బయటికి గక్కిస్తరు. మనం మనకు దెల్సిన బతుకుగాదు, దొరజెప్పిన బతుకుబతకాలె. దొరపడిగె నీడకిందనే, మాబతుకులు నిలవాలె..

పద్ధతిమారితే, బతుకుపాడె ...

డబ్బిచ్చికొంత, బెదిరిచ్చికొంత, కేసులు వెట్టికొంత మొత్తం ఊరంతను దొరగుప్పిట్ల వట్టిండు ... నా కొడుకులు సొసంత్రంగా బతికే సరికి, కాలికిందకు రాకపొయ్యేసరికి, కాలుకు ముల్లు గుచ్చుకున్నట్లయింది.

ఊల్లను లొంగదీయనీకె. ఎయ్యని ఉపాయం లేదు.

ఊల్ల దొంగతనాలయితె మామీద రుద్దిండు. ఊరి బాపనోల్ల పోరిని, మాదిగోల్ల పోరడు ఎత్తుకపోతే, కేసు మొత్తం మా పిల్లల మీదకి దిప్పిండు. లేవదీస్కపోయినోణ్ని బట్టుకుని యాడగొంతు పిస్కిండొ తెల్వదు గాని, గాపోరణ్ణిమాయం జేసింది మాపిల్లలేనని నమ్మింపజేసిండు ...

ఊరు ఊరంతా ఊరకుక్కయింది.

గారోజున ఊరోల్లకు దొర ఏమేమి జెప్పిండో తెల్వదుగాని, ఊరంతా నాకొడుకుల మీద పడ్డారు. మా పోరడ్ని తెచ్చియ్యమని ఒకడు, మాపైసలు తెచ్చియ్యమని ఒకడు, మా గొర్రెల్ని తెచ్చియ్యమని ఒకడు, పిచ్చికొట్టుడు గొట్టింగ్రు ... దొరతనాన్ని ఏలెత్తి సూపని దొంగనాకొడుకులు, నా బిడ్డల మీద పిడికిళ్లు ఎత్తుకున్నారు. చిన్న తప్పుకు సింత సెట్టుకు గట్టేసి, కొడ్తా ఉంటే, కళ్లు దించేసుకునే కొజ్జనాకొడుకులు, నా బిడ్డల మీదకి పులులయింగ్రు.

ఆరోజు మసీదు కాడికి, నాబిడ్డల్ని పెడరెక్కలు ఇర్సి కట్టి తెచ్చింగ్రు. ఒగతన్నుడుగాదు, ఒగకొట్టుడుగాదు బిడ్డా. అడ్డొచ్చిన ఆడోల్ల సీర లిడిపిచ్చిగ్రు. సిన్న పిల్లల్ని పొర్లిచ్చితన్నింగ్రు. ముసలోల్ల సంగతి సెప్పుకోలేము. మసీదుకాడ రక్తాలు సిందేయి బిడ్డా .. రక్తాలుసిందేయి ..

దొరసేతికి మన్నంటకుండ, మావొల్లతోటి

మముల గొట్టి పిచ్చిండు. తన ఇంటిముందు గాక, మా గేర్లనే పంచాయితి పెట్టించిండు. ఇందులో దొర ఎక్కడాలేడు. కాని, అంతట ఆయనే ఉన్నాడు. మందిని మామీదకి ఉసిగొల్పి తాను ఊరెల్లిపోయిండు ..

మారాజు .. సల్లంగబతకాలె ..

దొరతనాన్నెదిరిస్తే, సిన్న బతుకు లేమయి తయో సక్కగ జూపిండు నాయనా .. సక్కగ జేసిండు ..

ఇంకేముంది సెప్పుకోడాన్కి -?

మా ఇండ్లకు అగ్గిపెట్టి, మా బతుకుల మంటలెట్టి మాబిడ్డల్ని ఊరినుండి తరిమిగొట్టి, దిక్కులేని పచ్చుల జేసిండు..


నల్గురు బిడ్డలు నాల్గు దిక్కులకు..

నేనిక్కడ ..

గుడిసెల గుడ్డిదీపంలాగ .. ఊరి మీద శాపంలాగ ..

ఊరిడువదు, కాడుపిలువదు.

బాంచోల్ల రాజ్జెం బిడ్డా .. ఇది బాంచొల్లరాజ్జెం దొర అడుగులొత్తెటోల్ల, ఉచ్చులు తాగెటోల్లరాజ్జెం. ఇది నియ్యతుకు




తావులేని రాజ్జెం. అడుగుముందలికేస్తే కాళ్లు కసుక్కున నరికేరాజ్జెం. మంచి మనుసున నగితే పెదాలకు కుట్లేసేరాజ్జెం.. ఇది బాడు కావుల రాజ్జెం. ఇది బంచోతులరాజ్జెం.

అయితే, ఏమయింది బిడ్డా!

సీకటెంట పగలు

ఇవ్వాడు ఎలగొత్తెఏమయింది! ఎప్పటికన్న నా బిడ్డలు తిరిగొస్తరు ... తప్పక తిరిగొస్తరు .. నాల్గుదిక్కులకు సీలిననాబిడ్డలు, నాల్గు దిక్కులయి కలిసొస్తరు. ఆటల్తోటి, పాటల్తోటి, గుండెనిండ మంటల్తోటి, ఊరిని నిద్రలేపుతారు. ఊరిని, దొరతనంనుండి ఇడగొట్టి, గిరిగీసి బరిలనిల్పుతరా వొంచిన తలలు ఎత్తుకుంటాయి...

సెలరేగిన మంటలల్ల దొరతనం బూడిదయితది ..

అప్పుడు ఈ ముసిల్దాన్ని, నేనులేకుం టేమి?

నా బొందమీద గడ్డిపోసలు తలలూపు తాయి.

సంతోషంల ఎన్నెలపాటలు పాడుతాయి.

# తస్లీమా !!

జయప్రభ





వీళ్ళున్నారే .....
తస్లీమా !!
శరీరానికి విషగ్రంధుల్లాంటి వాళ్ళు
సైతానుల స్వర్గం లాంటి వాళ్ళు

సాక్ష్యాలకి రాలేని దేవుళ్ళమీద
మత భారాలన్నీ మోపి
చక్రాల్ని తిప్పుతున్న వాళ్ళు
సత్సంగుల ఛాయల వెనకే వీళ్ళు
శవబోధలు చేస్తున్న వాళ్ళు

శూలాలతోనో
చురకత్తుల తోనో
దేశ దేశాల్లో రక్తనామాల్ని లిఖిస్తూ ........
పులిగోళ్ళని పండిస్తూ ......
వీళ్ళున్నారే -
తస్లీమా !!
పరుషంగా పుట్టిన వాళ్ళు
పగటికి
చీకటిని పొగపెట్టిన వాళ్ళు

వీళ్ళు
తిరుమార్గం దిద్దినా మనకే
శిలువని వేళ్ళాడదీసినా మనకే
అల్లాకే నామ్ !
అంతా మనమీదికే !

అందుకే
వీళ్ళు కొలువు తీరిన చోటల్లా
పురాణాల్లో ............. ఖురానుల్లో .....
కరుణంటే తెలియని
కటిక దేవుళ్ళే ఉంటారు !!

జన్మ జన్మలుగా తలలొంచి
చితిలోని సీతలమైనామనే ....
వీళ్ళందరి సంతోషమూనూ !

కాదుకాదంటే మనం ఎవరిమైనా
కలం పట్టుకుంటే ఏమూలవారమైనా
వెల నిర్ణయించి తలని ఖండించమనే
వీళ్ళున్నారే ......
తస్లీమా !
హృదయాలని చిదిమేసి
గర్భంలోనే గుడి కట్టగలవాళ్ళు
గరళాన్నే నైవేద్యం పెట్టగల వాళ్ళు

వీళ్ళలో ....
ఎర్ర వాళ్ళుంటారు
నల్ల వాళ్ళుంటారు
తెల్ల వాళ్ళూ ఉంటారు
తస్లీమా !!
తల్లికి పుట్టిన వాళ్ళే ఉంటారు